సాక్షి
చిత్తూరు
గురువారం । 8 । మే । 2025



వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళదాం

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళదామని మాజీ మంత్రి ఆర్కే రోజా వైఎస్సార్ సీపీ నేతలకు పిలుపునిచ్చారు. - 10లో



రూ.కోట్లు కొల్లగొట్టే స్కామ్

కుట్టు శిక్షణ పేరుతో కూటమి సర్కారు రూ.కోట్లు కొల్లగొట్టే స్కామ్‌కు పాల్పడిందని వైఎస్సార్ సీపీ నేతలు ఆరోపించారు. - 10లో



మాకింత విషమిచ్చి..

మాకింత విషమిచ్చి మా ప్రాణాలు తీసి, భూములు తీసుకుని, ఫ్యాక్టరీలు కట్టుకోండని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. - 10లో

న్యూస్‌రీల్

సిందూర్ విజయవంతంపై జెడ్పీ చైర్మన్ హర్షం



జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు: ఆపరేషన్ సింధూర్ విజయవంతంపై జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలో బుధవారం ఆయన మాట్లాడుతూ పెహల్గాంలో ఉగ్రవాదులు దాష్టికాన్ని చూసి బాధపడిన ఎందరో భారతీయులకు మనసులు ఇంకా కుదటపడలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి యావత్తు దేశం అండగా ఉందన్నారు. ఉగ్రవాదాన్ని పూర్తిగా నాశనం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

మాజీ సైనికుల సంబరాలు

పలమనేరు పట్టణానికి చెందిన మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో మాజీ సైనికులు బుధవారం స్థానిక ఏటీఎం వద్ద సంబరాలు చేసుకున్నారు. ఇలాంటి సమయంలో ప్రజలంతా దేశం కోసం అండగా నిలుద్దామన్నారు. ఇందులో మిలటరీ సిద్దయ్య, మాజీ సైనికులు పాల్గొన్నారు.

సహకార బ్యాంకుల బలోపేతానికి కృషి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): సహకార బ్యాంకుల బలోపేతానికి కృషి చేయాలని డీసీసీబీ సీఈఓ శంకరన్ పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని డీసీసీబీ సమావేశ మందిరంలో బ్రాంచ్ మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సహకార బ్యాంకుల్లో పారదర్శకంగా సేవలు అందించాలన్నారు. ఖాతా దారుల సంఖ్యను పెంచుతూ బ్యాంకుల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. పకడ్బందీగా రుణాలు ఇవ్వడంతో పాటు తిరిగి రుణాల వసూళ్లపై కూడా దృష్టి సారించాలన్నారు. ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందులు ఉండ కూడదని ఆయన సూచించారు.

రేషన్ కార్డు దరఖాస్తులకు ఆన్‌లైన్‌లో అవకాశం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): రేషన్‌కార్డుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. బుధవారం నుంచి రేషన్‌కార్డుకు సంబంధించిన వెబ్‌సైట్‌లో దరఖాస్తుకు ఆప్షన్ ఇచ్చింది. ఈ కొత్తకార్డులతో పాటు కార్డులో సభ్యుల చేరిక, సభ్యుల తొలగింపు, కార్డు విభజన, కార్డు సరెండర్ తప్పుడు ఆధార్ సీడింగ్ దిద్దుబాటుకు దరఖాస్తు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించింది. సచివాలయం వేదికగా ఈ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. పాత పద్ధతి, నిబంధనల ప్రకారమే కార్డులు జారీ ఉంటుందని అధికారులు వెల్లడిస్తున్నారు. దరఖాస్తు దారులు దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ, ఫొటో సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఇద్దరు కంటే ఎక్కువ మంది ఉంటే కార్డు విభజనకు అవకాశం ఉంటుందని డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు. సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే తహసీల్దార్ లాగిన్‌లో అప్రూవ్ అయినా వెంటనే కార్డులు సచివాలయంలోనే తీసుకోవచ్చన్నారు. ఇందుకు ప్రభుత్వం 21 రోజులు గడువు విడించిందని ఆయన పేర్కొన్నారు.

అంగన్‌వాడీ పోతున్నారు!



- ఉన్నత విద్యాసంస్థలకూ సెలవులు
- అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు లేమి
- ఉక్కపోతతో అల్లాడుతున్న చిన్నారులు
- సరిహద్దు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో సైతం సెలవులు

చిన్నారుల వికాసానికి.. పూర్వప్రాథమిక విద్యకు వేదిక అయిన అంగన్‌వాడీ కేంద్రాలు సౌకర్యాల లేమితో కునారిల్లుతున్నాయి. ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 8 గంటలకే భానుడు భగభగమంటున్నాడు. చిన్నారులు ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. వేడికి తాళలేక అవస్థలు పడుస్తున్నారు. విద్యుత్ అంతరాయం సమయంలో వారి బాధ వర్ణనాతీతంగా ఉంది. అయినా కూటమి సర్కారు సెలవులు ఇవ్వకుండా వేడుక చూస్తోంది.

చిత్తూరు కలెక్టరేట్ : అభం శుభం ఎరుగని చిన్నారుల ఆరోగ్యంపై కూటమి సర్కారు కాఠిన్యం ప్రదర్శిస్తోంది. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ప్రకటించినా రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించకుండా వేడుక చూస్తోంది. పైగా అంగన్‌వాడీ కార్యకర్తలకు 15 రోజులు, ఆయాలకు 15 రోజులు సెలవులు మంజూరు చేసినా, ఎవరో ఒకరు కేంద్రాన్ని నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో చాలీచాలని ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు వేసవి కారణంగా ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా రోజూ 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదవుతోంది. ప్రస్తుతం పాఠశాల, కళాశాల, డిగ్రీ విద్యార్థులందరికీ వేసవి దృష్ట్యా సెలవులు ఇచ్చేశారు. అయితే అభం శుభం ఎరుగని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మాత్రం కూటమి సర్కారు సెలవులు ప్రకటించలేదు. మండుతున్న ఎండల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు వేసవి తాపం తట్టుకోలేపోతున్నారు.

ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి

జిల్లాలో ఉదయం 9 గంటల నుంచే ఎండలు మండిపోతున్నాయి. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫ్యాన్లు ఉన్నా ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. ఫ్యాన్లు లేని చోట్ల చిన్నారుల పరిస్థితి చెప్పనవసరం లేదు. చిన్నారులు ఉక్కపోత తాళలేక ఏడుస్తుంటే, వారిని సముదాయించలేక ఆయాలు ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్ సరఫరా లేని సమయంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు బాధ వర్ణనాతీతంగా ఉంది. అలాగే గర్భిణులు, బాలింతలు సైతం పౌష్టికాహారం కోసం ఎండలోనే అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.



ఐరాల మండలంలోని ఓ కేంద్రంలో చిన్నారులు

వేసవి సెలవుల్లో కిశోరి వికాసమట..

వేసవి సెలవుల్లో కూటమి సర్కారు కిశోరి వికాసం కార్యక్రమం చేపడుతోంది. వేసవి సెలవులు ఇవ్వకుండా ఈ కార్యక్రమం చేపడుతుండడంతో విమర్శలు గుప్పుమంటున్నాయి. ఈ నెల 2 నుంచి జూన్ 10వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేలా ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. కార్యక్రమం మంచిదే అయినప్పటికీ, వేసవి సెలవుల్లో నిర్వహించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. అంగన్‌వాడీ కార్యకర్తలు కన్వీనర్లుగా వారి కేంద్రాల పరిధిలోని కిశోరి బాలికలను సర్వే చేసి, సచివాలయాల పరిధిలో ఏఎన్‌ఎం, ఎంఎస్‌కేలతో కలిసి ప్రతి మంగళ, శుక్రవారాల్లో బడి బయట పిల్లలు, బాల్యవివాహాలు, పుట్టే బిడ్డల ఆరోగ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అయితే క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమం తూతూ మంత్రంగా సాగుతోంది.

జిల్లాలోని అంగన్‌వాడీల సమాచారం

మెయిన్ అంగన్‌వాడీలు	1,795
మినీ అంగన్‌వాడీలు	625
7 నెలల నుంచి 3 ఏళ్ల బాలురు	28,783
7 నెలల నుంచి 3 ఏళ్ల బాలికలు	27,012
3- 6 సంవత్సరాల బాలురు	17,521
3- 6 సంవత్సరాల బాలికలు	17,481
మొత్తం బాల,బాలికలు	90,797

సర్కారుకు ఆ మాత్రం తెలియదా?



అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ నెల ఒకటో తేదీ నుంచి నెల రోజులు సెలవులు ఇవ్వాలని అడిగాం.ఇంతవరకు అతీగతీ లేదు. చిన్నారులు, గర్భిణులు, చిన్నారులు, బాలింతలకు అందించే పౌష్టికాహారం ఇళ్లకు ఇవ్వాలన్నా ఈ ప్రభుత్వం పట్టించుకోలేదు. పని ఒత్తిడి తగ్గిస్తామన్నారు కానీ, ఇంకా పెంచుతూనే ఉన్నారు. జీతాల విషయంలోనూ పట్టించుకోవడం లేదు. ఎండలు మండుతున్నా అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ఇవ్వాలని సర్కారుకు తెలియదా?

– ప్రేమ, రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షురాలు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ అసోసియేషన్

పొరుగు రాష్ట్రాల్లో సెలవులిచ్చారు కదా?



జిల్లా సరిహద్దులోని కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ఇచ్చారు. ఏపీలో మాత్రం వింత ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఇక్కడ ఎందుకు ఇలా వ్యవహరిస్తున్నారో తెలియడం లేదు. సెలవులు ఇవ్వాలని రెండు నెలలుగా అడుగుతున్నా, ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఇటీవల కాలంలో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతోంది. చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– రాధమ్మ, ఏఐటీయూసీ యూనియన్ నాయకురాలు, ఎస్‌ఆర్ పురం

గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం సీడాప్ సౌజన్యంతో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో గ్రామీణ నిరుద్యోగ యువతకు పలు కోర్సుల్లో ఉచిత నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రాజాసింగ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామీణ నిరుద్యోగ యువతకు డీడీయూ–జీకేవై పథకంలో జూనియర్ సాఫ్ట్‌వేర్ వెబ్ డెవలపర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, కంప్యూటర్ హార్డ్‌వేర్ అండ్ నెట్‌వర్కింగ్, బ్యూటీ థెరపీ కోర్సుల్లో నాలుగు నెలల పాటు శిక్షణ ఇస్తామన్నారు. వైఎస్సార్ కడప కేంద్రంలో ఇచ్చే ఈ శిక్షణలో పాల్గొన్న అభ్యర్థులకు ఉచిత శిక్షణతోపాటు భోజనం, వసతి, కంప్యూటర్ నైపుణ్యాలు, స్పోకెన్ ఇంగ్లిష్, లైఫ్ స్కిల్స్ శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ప్రభుత్వం గుర్తించిన సర్టిఫికెట్ తోపాటు అర్హతను ఆధారంగా ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు 18–30 ఏళ్ల మధ్య ఉండాలన్నారు. జిల్లాలోని గ్రామీణ పేద కుటుంబాల యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌ఐహెచ్‌ఏఆర్‌ఎస్‌కేఐఎల్‌ఎల్.సీవోఎం (www.niharrki.com) లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9063082227, 9966448807 నంబర్లలో సంప్రదించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

చిత్తూరు జిల్లా కోర్టులో 171 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

చిత్తూరు అర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని న్యాయస్థానాల్లో పలు పోస్టుల భర్తీకి రాష్ట్ర హైకోర్టు నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 171 పోస్టుల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఇందులో స్టెనోగ్రాఫర్ 7, జూనియర్ అసిస్టెంట్ 25, టైపిస్ట్ 13, ఎగ్జామినర్ 3, కాపీయిస్ట్ 17, ప్రోసెస్ సర్వర్ 21, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు 85 చొప్పున ఖాళీలున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు www.aphc.gov.in అనే వెబ్‌సైట్‌లో ఈనెల 13 నుంచి వచ్చేనెల 2వ తేదీ అర్ధరాత్రి 12 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటికే జిల్లా కోర్టు పరిధిలో అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న వారు ఈనెల 13 నుంచి వచ్చేనెల 24వ తేదీలోపు చిత్తూరులోని జిల్లా కోర్టుకు వచ్చి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ఇతర వివరాలకు చిత్తూరు జిల్లా కోర్టులోని పరిపాలన అధికారిని సంప్రదించాలని న్యాయశాఖ అధికారులు తెలిపారు.

అల్లూరి ఆశయాలు ఆదర్శం

చిత్తూరు అర్బన్: అల్లూరి సీతారామరాజు ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శమని చిత్తూరు ఎస్పీ మణికంఠ అన్నారు. అల్లూరి వర్ధంతి సందర్భంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ నిబంధనలు అమలు చేయడంతో పాటు న్యాయాన్ని నిలబెట్టాలనే అల్లూరి జీవిత సత్యం భారతావని మరువదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ శివ నందకిషోర్, డీఎస్పీలు మహబూబ్ బాషా, చిన్నికృష్ణ, డీసీఆర్‌బీ సీఐ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విప్లవ వీరుడు అల్లూరి

చిత్తూరు కలెక్టరేట్ : భారతదేశంలో బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అని ట్రైనీ కలెక్టర్ నరేంద్రపాడల్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య చరిత్రలో ఒక మహోజ్వల శక్తి అల్లూరి సీతారామరాజు అన్నారు. సాయుధ పోరాటం చేస్తేనే స్వాతంత్ర్యం వస్తుందని నమ్మిన మన్యం వీరుడు అల్లూరి అని కొనియాడారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మోహన్‌కుమార్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి, కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న ట్రైనీ కలెక్టర్ నరేంద్రపాడల్

కుట్టు.. ఉపాధికి పడేనా మెట్టు

- నగం సెంటర్లలోనే శిక్షణ ప్రారంభం
- ఎంపికలో రాజకీయ ప్రమేయం
- కేంద్రాలలో అరకొర సౌకర్యాలు
- కొన్ని సెంటర్లలో పాడైన కుట్టుమిషన్ల ఏర్పాటు

పలమనేరు: జిల్లాలోని డ్వాక్రా గ్రూపుల మహిళల ఉపాధి కోసం బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణతో వారికి స్వయం ఉపాధికి మెట్టు పడేనా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. చిత్తూరు జిల్లాలో 70 కుట్టు శిక్షణ కేంద్రాలు మంజూరు చేశారు. ఇందులో సగం మాత్రమే ప్రారంభమయ్యాయి. కొన్నిచోట్ల లబ్ధి దారులు లేక, ఉన్న వారికి శిక్షణకు అవసరమైన భవనాలు లేక ఇబ్బందులు తప్పడం లేదు. నిబంధనల మేరకు ఒక్కొక్క సెంటర్‌లో 25 కుట్టు మిషన్లు ఏర్పాటు చేయాలి. ఈ క్రమంలో కొన్ని పాత మిషన్లు, పాడైన వాటిని పెట్టి లెక్కకు కనిపించేలా జిమ్మిక్కులు చేశారు. దీంతో శిక్షణ ఎలా సాగుతుందనేది ప్రశ్నార్థకంగా మిగిలింది.



కబుర్లు చెప్పుకుంటున్న మహిళలు

లబ్ధిదారుల ఎంపిక నుంచే రాజకీయ జోక్యం

టైలరింగ్ శిక్షణ కోసం డ్వాక్రా గ్రూపు మహిళలను సచివాలయాల వారీగా ఎంపిక చేశారు. దీంతో ఆయా పంచాయతీల్లోని అధికారపార్టీ నాయకులు సూచించిన వారిని మాత్రమే అధికారులు ఎంపిక చేశారనే విమర్శలున్నాయి. కుట్టు శిక్షకుల ఎంపికలోనూ రాజకీయ జోక్యం ఉన్నట్టు తెలిసింది.

శిక్షణ నిబంధనలివీ..

ఒక్కొక్క శిక్షణ కేంద్రంలో గరిష్ఠంగా 120 మంది ఉండాలి. రోజుకు రెండు షిఫ్టులుగా ఉదయం 4 గంటలు, మధ్యాహ్నం 4 గంటలు శిక్షణ ఇవ్వాలి. తొలుత థియరీ, ఆపై పేపర్ కటింగ్, మళ్లీ కుట్టుమిషన్‌పై శిక్షణ ఇవ్వాలి. శిక్షణ కాలంలో కనీసం 75 శాతం హాజరు తప్పనిసరి. ఇందుకు ఇన్ అండ్ అవుట్ ఫ్రింగర్ ప్రింట్ అటెండెన్స్ వేయాలి. శిక్షణ పూర్తి చేసిన మహిళలకు రూ.4,300 విలువ జేసే కుట్టుమిషన్, స్టయిఫండ్ రూ.3 వేలు, మొత్తం ఒక్కొక్కరికి రూ.7,300 ఇవ్వాలి.

మౌలిక సదుపాయాలు ఇతర శాఖలపై...

సెంటర్ వద్ద మరుగుదొడ్లు, విద్యుత్, తాగునీరు, ఫర్నీచర్, ఫస్ట్ ఎయిడ్ కిట్లు తదితర మౌలిక సదుపాయాలను శిక్షణ కాంట్రాక్టు దక్కించుకున్న వారే ఏర్పాటు చేయాలి. కానీ వీటిని ప్రభుత్వ భవనాలైన వెలుగు కార్యాలయాలు, ఎంపీడీఓ ఆఫీసుల్లో పెట్టారు. దీంతో ఆయా శాఖలే ఇప్పుడు అవసరమైన సౌకార్యాలను చేయాల్సి వస్తోంది. దీంతో అరాకొర సౌకర్యాల నడుమ శిక్షణ సాగుతోంది.

ప్రస్తుతం జరుగుతోందిలా..

కొన్ని సెంటర్లలో లబ్ధిదారులు లేక ఇంకా శిక్షణ ప్రారంభం కాలేదు. మరికొన్ని మండలాల్లో ఎంపిక ప్రక్రియ సాగుతూనే ఉంది. శిక్షణ ప్రారంభమైన కేంద్రాల్లోనూ నిబంధనల మేరకు శిక్షణ సాగడం లేదు. కబుర్లతోనే శిక్షణ సమయం ముగిచ్చేస్తున్నారు. శిక్షణకు అవసరమైన దారాలు, స్కేల్, కత్తెర తదితర సామగ్రి ఇంకా ఇవ్వలేదు. దీంతో లబ్ధిదారులే తెచ్చుకోవాల్సి వస్తోంది.

త్వరలో అన్ని ఏర్పాట్లు చేస్తాం

పది రోజులుగానే శిక్షణ కేంద్రాలను ప్రభుత్వ భవనాల్లో ప్రారంభించాం. ఆయా శాఖలు ఇప్పుడు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తే, వారు బిల్లు పెట్టుకుంటే మేమే చెల్లిస్తాం. ఇంకా కొన్ని సెంటర్లు ప్రారంభం కాలేదు. త్వరలో వాటిని సిద్ధం చేస్తాం. అభ్యర్థులకు కట్టు మిషన్‌పై శిక్షణ ఇచ్చే సమయానికి పాడైన కుట్టు మిషన్లను మరమ్మతు చేయిస్తాం. కచ్చితంగా 75 శాతం హాజరున్నవారికే ఉచితంగా కుట్టుమిషన్ ఇస్తాం. ఇప్పటి వరకు ట్రయల్ బేస్, గురువారం నుంచి అధికారికంగా మొదలవుతుంది. శిక్షణ పటిష్టంగా జరిగేలా చర్యలు తీసుకుంటాం.

– నాగరాజు, టైలరింగ్ ట్రైనింగ్ ఇన్‌చార్జ్, చిత్తూరు జిల్లా

కథ కంచికి.. మరి ఖాకీలు..?

- చిత్తూరులో దొంగా–పోలీస్ ఆట ముగిసినట్లేనా..!
- ఇన్‌స్పెక్టర్‌ను వీఆర్‌కు పంపడంతో సరిపెట్టేశారు
- ఎస్‌ఐతో పాటు ముగ్గురు పీసీల పాత్రపై సందేహాలు
- క్లీన్‌చిట్ ఇస్తారా.. తప్పు చేసినట్టు నిర్ధారించారా?
- ఇంతకూ విచారణలో ఏం తేల్చారో!



ఒక్కొక్కరికీ ఒక్కో ‘లా’..

చిత్తూరు అర్బన్: చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్. ఇటీవల వివాదాలకు, పలు ఆరోపణలకు కేంద్ర బిందువుగా మారింది. ఇక్కడ పనిచేసే ఒకరిద్దరు ఖాకీలు చేసే తప్పుడు పనుల కారణంగా.. నిజాయితీగా ఉంటున్న మిగిలిన పోలీసులూ నిందలు మోయాల్సిన పరిస్థితి. ఇటీవల ఇక్కడ పని చేసిన ఇన్‌స్పెక్టర్ (సీఐ)ను అవినీతి ఆరోపణలపై వీఆర్ (వేకెంట్ రిజర్వు)కు పంపించారు. ఇది శిక్షా? శిక్ష నుంచి తప్పించడమో? తెలియడంలేదు. ఇదే సమయంలో ఆరోపణలున్న మరో నలుగురిని ఇక్కడే కొనసాగిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది.

పలమనేరు అధికార పార్టీ ఎమ్మెల్యే చల్లిన బురదను కడుక్కోవడానికి జిల్లాలో ఏకంగా 250 మందికి పైగా సిబ్బందిని ఇష్టానుసారంగా బదిలీ చేసిన జిల్లా పోలీసు యంత్రాంగం.. అవినీతి ఆరోపణలు వచ్చిన ఖాకీలపై ఉదాసీన వైఖరి ప్రదర్శిస్తోంది. నిందితుడి భార్య, బంధువుల నుంచి రూ.12.50 లక్షలు ఖాకీలు కొట్టేసినట్లు ఆరోపణలు వచ్చాయి. చిత్తూరులోని ఓ కానిస్టేబుల్ తన ఫోన్‌పేకు రూ.3 లక్షలు వేసుకోవడం, ఓ అధికారి రూ.3 లక్షలు, మరో అధికారి రూ.6 లక్షలకు పైగా తీసుకుని అందులో కొంత మొత్తం వెచ్చించి స్టేషన్‌కు రంగులు వేయించడం, సిబ్బందికి, అధికారులకు యూనిఫామ్ కొనిచ్చారనే ఆరోపణలు పోలీసుశాఖను కుదిపేశాయి. అనంతపురం డీఐజీ నుంచి చిత్తూరు ఎస్పీ వరకు దీనిపై ఆరా తీశారు. చివరకు చిత్తూరు ఏఎస్పీ రాజశేఖర్‌రాజును ప్రత్యేక అధికారిగా నియమిస్తూ, జరిగిన ఘటనపై విచారణకు ఆదేశిస్తున్నట్లు మీడియాకు ప్రకటించారు. సుదీర్ఘ విచారణ తరువాత గతనెల 8న చిత్తూరు వన్‌టౌన్ సీఐగా పని చేస్తున్న జయరామయ్యను వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇందులో కీలక పాత్ర పోషించిన ఓ ఎస్‌ఐ, ముగ్గురు కానిస్టేబుళ్లపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పైగా సీఐను వీఆర్‌కు పంపడం అతడిని శిక్షించినట్టా..? కాపాడినట్టా..? అంటూ పోలీసుశాఖలోని అధికారులే విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రూ.500 లంచం తీసుకున్నారనే ఆరోపణలతో కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసిన అధికారులు, రూ.12.50 లక్షలు దొంగ నుంచే కొట్టేసిన అధికారుల విషయంలో మిన్నకుండడం విమర్శలకు దారితీస్తోంది. పైగా ఆరోపణలున్న ఎస్‌ఐ చేతిలో తప్పులు చేసేవాళ్లపై కేసులు నమోదు చేసే బాధ్యతను పెట్టడం సమాజానికి ఎలాంటి సంకేతాలు ఇస్తున్నారని సామాన్యులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అసలు విచారణలో ఏం నిర్ధారించారు..? తప్పు చేయకపోతే సీఐను మాత్రం ఎలా వీఆర్‌కు పంపుతారు..? ఎస్‌ఐ, మరో ముగ్గురి పాత్ర లేదా..? అనే సందేహాలు బేతాళ ప్రశ్నలుగా మిగిలిపోయాయి. విచారణ విషయాలు బయటపెట్టకపోవడానికి ఇది దేశ సార్వభౌమత్వం, సమగ్రత, రక్షణ రంగానికి సంబంధించిన సున్నితమైన అంశాలు కావు. అసలు దొంగ–పోలీస్ ఆటను విచారించిన అధికారులు వాస్తవాలను ప్రజలకు చెప్పాలిన అవసరం ఉందనే వాదన బలంగా వినిపిస్తోంది.

ఇదీ జరిగింది..

సంపత్. విద్యుత్‌శాఖలో రిటైర్డ్ ఉద్యోగి. ఈ ఏడాది జనవరిలో చిత్తూరులోని ఇతని ఇంట్లో చోరీ జరిగింది. భారీ మొత్తంలో బంగారు ఆభరణాలు, నగదు చోరీకి గురయ్యాయి. పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. అసలు అన్ని నగలు ఇంట్లో ఎందుకు పెట్టుకున్నావ్..? నీకు ఎక్కడి నుంచి వచ్చాయ్..? డబ్బులు ఎలా వచ్చాయి..? అని పలు ప్రశ్నలతో విసుగెత్తించి, ఆలస్యంగా కేసు నమోదు చేశారు. అదే నెల 30వ తేదీన ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు 238.5 గ్రాముల బంగారు ఆభరణాలు, 65 గ్రాముల వెండి, మూడు సెల్‌ఫోన్లు, ఓ వాచీ, రూ.4.06 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇంత వరకు బాగానే కథ నడిచింది. రాయచోటిలో జరిగిన ఓ చోరీ కేసులో పట్టుబడిన దొంగ, ఇక్కడ చోరీ సొమ్ము నుంచి రూ.12.50 లక్షలు చిత్తూరు పోలీసులకు లంచంగా ఇచ్చినట్లు చెప్పడంతో అధికారులు ఉలిక్కిపడ్డారు. ఆ మొత్తాన్ని తమకు ఇచ్చేస్తే దొంగ చోరీ చేసిన సొత్తుగా చూపించి, బాధితులకు ఇచ్చేస్తామని రాయచోటి పోలీసులు అడిగితే చిత్తూరు పోలీసులు అందుకు నిరాకరించడంతో విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి చేరవేశారు.

నేడు నిపుణల కమిటీ రాక

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రికి గురువారం నిపుణల కమిటీ రానుంది. ఇటీవల ఆస్పత్రిలో సరైన వైద్యం అందక శ్రీదుర్గ అనే మహిళ మృతి చెందిందని ఆరోపిస్తూ ఆమె కుటుంబ సభ్యుల నుంచి అందిన ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ విచారణ కమిటీ వేశారు. ఈ మేరకు తిరుపతి రుయా ఆస్పత్రి వైద్యులతో నియమించిన ఈ కమిటీ మధ్యాహ్నం 12.30 గంటలకు ఆస్పత్రికి రానుంది. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టనున్నట్లు ఆస్పత్రి అధికారులు తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 20 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 69,214 మంది స్వామివారిని దర్శించుకోగా 26,599 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.27 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టికెట్లు లేని భక్తులకు 6 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పలమనేరులో భారీ వర్షం

- నేలరాలిన మామిడి,
- దెబ్బతిన్న తీగ పంటలు



ముసలిమడుగు వద్ద నేలరాలిన మామిడి, నేలవాలిన బీర, అరటి తోటలు

పలమనేరు: మండలంలో బుధవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. వర్షంతోపాటు పెనుగాలులు వీచాయి. దీంతో పలుచోట్ల మామడికాయలు నేల రాలాయి. కోతకొచ్చిన టమాట దెబ్బతింది. ఇక తీగ పంటలైన కాకర, బీర, బీన్స్ పంటలు దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల అరటి పంటకు నష్టం వాటిల్లింది. పెనుగాలులతోపాటు అక్కడక్కడ వడగళ్ల వర్షం కురిసింది. దీంతో మామిడి కాయలకు మచ్చలు పడ్డాయి. వీటికి మార్కెట్‌లో ధర ఉండదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తోటల్లో రాలిన మామిడిని తక్కువ ధరతో అమ్ముకోవాలని చెప్పారు. ముఖ్యంగా పెంగరగుంట, సముద్రపల్లి, కరిడిమొడుగు, బయ్యప్పగారిపల్లి పంచాయతీల్లో మామిడి తోటలకు ఎక్కువగా నష్టం జరిగింది. దెబ్బతిన్న పంటలను పరిశీలించి నష్టపరిహారం అందజేయాలని బాధిత రైతులు కోరుతున్నారు. ఈ విషయమై స్థానిక ఉద్యానశాఖ అధికారి లక్ష్మీప్రసూనను వివరణ కోరగా వర్షానికి దెబ్బతిన్న పంటలను గురువారం పరిశీలించి, తగు చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు.

పట్టణంలో అంధకారం

వర్షం కారణంగా పలమనేరు పట్టణంలోని రాధా బంగ్లాతోపాటు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా అంధకారం నెలకొంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు, నాగమంగళం హైవేవద్ద వర్షపునీరు నిలిచింది.

క్లుప్తంగా

గుణశేఖర్‌రెడ్డిపై కేసు నమోదు చేయండి

పోలీసులకు ఫిర్యాదు చేసిన వైఎస్సార్ సీపీ నేతలు



సీఐకి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

నగరి: మాజీ మంత్రి ఆర్కే రోజా, ఆమె కుటుంబ సభ్యుల పరువు ప్రతిష్టలకు భంగం కలిగించేలా అసత్యపు ఆరోపణలు చేసిన విజయపురం మండలం, కళియంబాకం గ్రామానికి చెందిన తెలుగునాడు ట్రేడ్ యూనియన్ జిల్లా కార్యదర్శి గుణశేఖర్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని సీఐ విక్రమ్‌కు వైఎస్సార్ సీపీ నేతలు ఫిర్యాదు చేశారు. బుధవారం మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినవారు తమ ఫిర్యాదు పత్రాన్ని సీఐకి అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ నీలమేఘం మాట్లాడుతూ అధికారపార్టీ నేతల వద్ద మెప్పుపొందేందుకు గుణశేఖర్‌రెడ్డి తనపైనా, మాజీ మంత్రి కుటుంబంపైనా లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం నీచ రాజకీయానికి పరాకాష్ట అని, ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. సంఘంలో గౌరవప్రదమైన స్థానంలో ఉన్న వారిపై రాజకీయ లబ్ధి కోసం, స్వప్రయోజనాలకు ఆరోపణలు చేస్తున్న గుణశేఖర్‌రెడ్డిని అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరామన్నారు. వైఎస్సార్ సీపీ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బాలన్, కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, మురుగ, నాయకులు కృష్ణమూర్తి, అయ్యప్ప పాల్గొన్నారు.

పరువు నష్టం దావా వేసిన మాజీ మంత్రి

తనపై, తన కుటుంబంపై అసత్యపు ఆరోపణలు చేసిన గుణశేఖర్‌రెడ్డిపై మాజీమంత్రి ఆర్కేరోజా బుధవారం పరువునష్టం దావా చేశారు.

నాటు బాంబు పేలి బాలుడికి గాయాలు

యాదమరి: వన్యప్రాణుల కోసం పెట్టిన నాటు బాంబుకు ఓ బాలుడు తీవ్రగాయాలు పాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే.. మండలంలోని కాశిరాళ్ల కొత్తూరు గ్రామానికి చెందిన కృష్ణయ్య భార్య తులసి తన కుమారుడు లోహిత్(7)ను వెంట తీసుకుని మేకలు మేపడానికి సమీప అడవిలోకి వెళ్లారు. అయితే అక్కడ వన్యప్రాణుల వేట కోసం వేటగాళ్లు నాటు బాంబును అమర్చారు. బాలుడి కాళ్లకు ఏదో తగిలిందని గమనించి.. దానిని చేతిలోకి తీసుకున్నాడు. అది చేతిలోనే పేలడంతో బాలుడి ఎడమ చేతికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతని తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని స్థానిక ఎస్‌ఐ ఈశ్వర్ తెలిపారు.

చిత్తూరులోని దుకాణంలో చోరీ

చిత్తూరు అర్బన్: నగరంలోని పొన్నియమ్మ గుడి వీధిలో ఉన్న ఓ దుకాణంలో రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ పాల్పడిన ఘటన బుధవారం వెలుగు చూసింది. పొన్నియమ్మ గుడివీధిలో బాబు అనే వ్యక్తి ఎలక్ట్రికల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి దుకాణం మూసి వేసి, ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం వచ్చి చూడగా తలుపులు పగులగొట్టి పలు వస్తువులను చోరీ చేసిన విషయం గుర్తించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వగా, ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు విచారణ ప్రారంభించారు.

మాకింత విషమిచ్చి.. భూములు తీసుకోండి

- పరిశ్రమలకు భూములు ఇచ్చేందుకు రైతులు ససేమిరా?
- సర్వేని అడ్డుకుని..అధికారులపై ఆగ్రహం



రైతులతో చర్చిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడా పీడీ వికాస్ మర్మత్

శాంతిపురం: 'మాకు తలా ఇంత విషమిచ్చి.. మా ప్రాణాలు తీసేశాక మా భూములు తీసుకుని మీరు ఫ్యాక్టరీలు కట్టుకోండి. తరాలుగా అనుభవిస్తున్న భూములు పూర్తిగా లాక్కుని మీరిచ్చే కాసులు ఖర్చయ్యాక మేము వీధుల్లో అడుక్కుతినాలి.' అని రైతులు వాపోయారు. కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పం–శాంతిపురం మండలాల పరిధిలో ఇండస్ట్రీయల్ పార్కు కోసం దండికుప్పం, సిద్ధారెడ్లపల్లి, వెంకటేష్‌పురం, అమ్మవారిపేట గ్రామాల్లో భూ సేకరణ సర్వే కోసం వచ్చిన అధికారులను రైతులు పాలెంగట్టు వద్ద గుమికూడి అడ్డుకున్నారు. పదేళ్ల క్రితం విమానాశ్రయం కోసం తీసుకున్న భూములు ఇప్పటికీ వృథాగా ఉన్నాయని ధ్వజమెత్తారు. క్షేత్రస్థాయి సిబ్బంది ప్రయత్నం చేసినా సర్వే చేయనివ్వకపోవడంతో బుధవారం కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులు, శాంతిపురం తహసీల్దార్ శివయ్య, రాళ్లబూదుగూరు ఎస్‌ఐ నరేష్ వెళ్లి రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా అది ఫలించలేదు. తమను నిరాశ్రయులను చేసే అభివృద్ధి తమకు వద్దని రైతులు తెగేసి చెప్పారు. దీంతో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, కడా పీడీ వికాస్ మర్మత్, కుప్పం డీఎస్పీ పార్థసారథి, అధికార పార్టీ నాయకులు కూడా అక్కడికి చేరుకుని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. తమకు కనీస సమాచారం కూడా ఇవ్వకుండా తమ భూములను ఎలా సర్వే చేస్తారని రైతులు ప్రశ్నించారు. అభివృద్ధి కోసం నాయకులు వాళ్ల సొంత భూములను ఇచ్చాక తమ భూములకు రావాలని స్పష్టం చేశారు. వృథాగా ఉన్న ప్రభుత్వ భూములను వదిలిపెట్టి తమ పొట్టలు కొట్టవద్దని చెప్పారు. చదువు లేని తమకు పరిశ్రమల్లో ఏమి ఉద్యోగాలు ఇస్తారని ప్రశ్నించారు. మళ్లీ తమ భూముల జోలికి వస్తే ప్రాణాలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు, నాయకులు ఎంతగా చెప్పినా రైతులు అంగీకరించకపోవడంతో మళ్లీ కలుద్దామని చెప్పి వెళ్లిపోయారు. బాధిత రైతులకు వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోదండ రెడ్డి, బాధితుల్లో ఒకరైన కుప్పం రెస్కో మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డి బాధితులకు సంఘీభావం తెలిపారు.

స్థానిక ఉపాధికి సహకరించండి

సీఎం చంద్రబాబుకు పలు సందర్భాల్లో కుప్పం ప్రజలు చేసిన వినతుల మేరకు స్థానికంగా ఉపాధి అవకాశాల కల్పనకు పరిశ్రమలు తెస్తున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ చెప్పారు. పిల్లలకు మంచి భవిష్యత్తును ఇచ్చేందుకు వచ్చే పరిశ్రమలకు సహకరించాలని కోరారు. రైతులు సహకరించి భూములు ఇస్తే పరిహారంతో పాటు వారి కుటుంబాలకు ఉద్యోగాలు ఇస్తామన్నారు. అందరి అభ్యంతరాలు తీర్చాకే ముందుకు పోతామన్నారు. శాంతిపురం మండలంలోనే నైక్, అడిడాస్ కంపెనీలు ప్రారంభిస్తారని చెప్పారు.

ఏమి కావాలో అడగండి

పరిశ్రమలకు భూములు కోల్పోయేవారు తమకు, వారి పిల్లల భవిష్యత్తుకు ఏమి కావాలో అడిగితే సీఎం దృష్టికి తీసుకుపోతామని కడా పీడీ వికాస్ మర్మత్ చెప్పారు. వ్యవసాయం ద్వారా 15 ఏళ్లలో రానంత మొత్తాన్ని పరిహారంగా ఇప్పిస్తామన్నారు. పదేళ్ల క్రితం ఎయిర్‌పోర్టుకు భూములిచ్చిన వారికి రావాల్సిన రూ.14 కోట్ల పెండింగ్ బిల్లులు వడ్డీతో సహా ఈ నెలాఖరు లోపు అందుతాయన్నారు.

వరుసగా లాక్కొంటున్నారు



నాలుగు తరాలుగా మాకు ఉన్న 11.66 ఎకరాల మెట్టభూమిని చదును చేసి, సాగులోకి తేవడానికి నానా అగచాట్లు పడ్డాం. ఈ భూమిలో పదేళ్ల క్రితం విమానాశ్రయానికి 3.75 ఎకరాలు తీసుకున్నారు. మళ్లీ హంద్రీనీవా కాలువకు రెండున్నర ఎకరాలు పోయింది. గ్యాస్ పైప్‌లైన్‌కు 2.25 ఎకరాలు తీసుకున్నారు. ఇప్పుడు మా కుటుంబానికి మిగిలింది 3.16 ఎకరాలు మాత్రమే. దానిలో అరటి, మామిడి తోటలు సాగు చేసుకున్నాం. ఇప్పుడు ఫ్యాక్టరీల కోసమని ఉన్న మొత్తం భూమిని ఇవ్వమంటున్నారు. అంతా ఇచ్చేసి మేము బిడ్డాపాపలతో ఎక్కడికి పోవాలి.?

– సల్లాపురి, వెంకటేష్‌పురం

నోట్లో మట్టి కొడుతున్నారు



మాకు పట్టా భూమి ఉన్నది 78 సెంట్లు మాత్రమే. అందులో కొంత పశుగ్రాసం వేసుకుని పశువులు పోషించుకుంటున్నాం. మిగతా పొలంలో కూరగాయలు పండిస్తూ ముగ్గురు కూతుర్లను చదివిస్తున్నాం. ఈ భూమినే నమ్ముకుని అందులో బోరు, డ్రిప్పులు వేసుకుని గౌరవంగా బతుకుతున్నాం. అనువంశికంగా వస్తున్న మా భూమి మొత్తం మా ఆధీనంలోనే ఉన్నా గతంలో ఆన్‌లైన్‌లో 20 సెంట్లు తగ్గించారు. ఇప్పుడు మొత్తానికి ఎసరు పెట్టారు. ఉన్న ఆస్తిని కోల్పోతే మేము, మా పిల్లలు ఏమి కావాలి.? ఇలా భూములు లాక్కుని డబ్బులు ఇచ్చే కంటే మాకు ఇంత విషమిస్తే గవర్నమెంట్‌కు ఫ్రీగా భూమి వస్తుంది.

– పద్మమ్మ, సిద్ధారెడ్లపల్లి

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళదాం



నగరి మున్సిపాలిటీ వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల సమావేశంలో మాజీ మంత్రి ఆర్కే రోజా

మాజీ మంత్రి ఆర్కేరోజా పిలుపు

నగరి : ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళతామని మాజీ మంత్రి ఆర్కే రోజా పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులకు పిలుపునిచ్చారు. బుధవారం నగరి పట్టణంలోని తన నివాసంలో ఉన్న పార్టీ కార్యాలయం వద్ద పుత్తూరు, నగరి మున్సిపాలిటీలకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నేతలతో ఆమె వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె పార్టీని బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి, అనుబంధ సంఘాల నేతలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ విభాగాలు, అనుబంధ విభాగాలు, పార్టీ శ్రేణులు ఇకపైన యాక్టివ్ పనిచేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ సూపర్ సిక్స్ అమలు చేయలేదన్నారు. విద్యాదీవెన, వసతి దీవెన, అమ్మఒడి ఆటకెక్కాయని, ఆస్పత్రుల అభివృద్ధి, ఆరోగ్యశ్రీ, రేషన్ డోర్ డెలివరీ, వలంటీర్ల వ్యవస్థ, రైతు భరోసా ఆగిపోయయాయన్నారు. వ్యవసాయం సహా విద్య, వైద్యం తదితర అన్ని రంగాల్లో రాష్ట్రం తిరోగమనం చెందుతోందన్నారు. పాలనలో పారదర్శకత లేదన్నారు. అభివృద్ధికి ఆనవాళ్లు కూడా లేకుండా పోయాయన్నారు. వీటిని ప్రజలకు తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి వారికి అండగా ఉండి పోరాడాలన్నారు. ఈ సమావేశాల్లో నగరి, పుత్తూరు మున్సిపల్ చైర్మన్లు పీజీ నీలమేఘం, హరి, పార్టీ అనుబంధసంఘాల నేతలు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాన్ని అభివృద్ధి చేయండి



మాట్లాడుతున్న డీఆర్‌ఓ మోహన్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ధర్తీ ఆబా జంజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకంలో గిరిజన గ్రామ అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని డీఆర్‌ఓ మోహన్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో గిరిజన శాఖ ఆధ్వర్యంలో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ధర్తీ ఆబా జంజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకంలో జిల్లాలోని పలమనేరు మండలం జగమర్ల గిరిజన గ్రామాన్ని సమగ్ర, స్థిరమైన అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. జగమర్ల గ్రామంలో మౌలిక సదుపాయాల పెంపు, ఆరోగ్యం, విద్య, జీవనోపాధిలో కీలకమైన అంశాలను గుర్తించి అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. జగమర్ల గ్రామానికి డీఆర్‌డీఏ, విద్య, వైద్యం, ఐసీడీఎస్, గ్రామీణ నీటి సరఫరా, పీఆర్, జిల్లా పంచాయతీ, వ్యవసాయ అనుబంధ, విద్యుత్, టెలీ కమ్యూనికేషన్స్, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి శాఖల అధికారులు వెళ్లి పరిశీలించాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖ అధికారి అందజేసే 144 అంశాల ఫార్మాట్‌ను సంబంధిత శాఖల అధికారులు వివరాలు నింపి పంపాలన్నారు. సంబంధిత శాఖలు అందజేసే వివరాలపై కలెక్టర్ ప్రతి నెలా జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో చర్చిస్తారన్నారు. ఆయా శాఖలు అందజేసే వివరాలను కేంద్రప్రభుత్వానికి పంపుతామన్నారు. అదేవిధంగా పలమనేరులో మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాయితీ రుణం ఇప్పిస్తా...రూ.15 వేలు ఇవ్వండి

- ఓ టీడీపీ నాయకుడు నిర్వాకం
- బాధితుల ఆవేదన

శ్రీరంగరాజపురం : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే రాయితీ రుణాల్లోనూ కొంత మంది టీడీపీ నాయకులు కమీషన్లు కొట్టే యత్నం చేస్తున్నారు. మాకు రూ.15 వేలు ఇస్తే.. మీకు రుణం ఇప్పిస్తామని మోసం చేస్తున్నారు. బాధితుల కథనం మేరకు.. మెదవాడ పంచాయతీ మెదవాడ గ్రామానికి చెందిన ఓ టీడీపీ నేత, అదే పంచాయతీ జంగాలపల్లిలో మైనారిటీలు సుమారు 15 మంది నుంచి మీకు కేంద్ర ప్రభుత్వం అందించే ముద్రలోన్, రాష్ట్ర ప్రభుత్వం అందించే మైనారిటీ లోన్ ఇప్పిస్తా.. తనకు అందరూ తెలుసు అంటూ సుమారు ఒక్కొక్కరి నుంచి రూ.15 వేలు వంతున వసూలు చేశారు. ఎంతకీ రుణం మంజూరు కాకపోవడంతో టీడీపీ నాయకుడిపై అనుమానంతో తమ డబ్బులు తమకు ఇచ్చేయమని అడగడంతో అతను తమను బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ఎటువంటి రాయితీ రుణం వద్దని, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, అధికారులు కలగజేసుకుని తమ డబ్బులు తమకు ఇప్పించి, న్యాయం చేయాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి

కార్వేటినగరం: ఆయిల్ పామ్ సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధ్యమవుతుందని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానశాఖ అధికారి మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంట నాలుగో సంవత్సరం నుంచి దిగుబడి వస్తోందని, అప్పటి వరకు అంతర పంటలు సాగు చేసుకుని, రెండు విధాల లాభాలు గడించవచ్చన్నారు. ఈ పంట 30 ఏళ్ల వరకు రైతుకు దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఆయిల్ పామ్ పంటను నీరు ఇంకే అన్ని రకాల నేలల్లో సాగు చేసుకోవచ్చని, పంట సాగుకు రైతులకు 40 శాతం సబ్సిడీ వస్తోందన్నారు. మొక్కలను త్రిభుజా కార పద్ధతిలో నాటు కోవాలని, అలాగే 14 నుంచి 18 నెలల్లో పూతకు వస్తుందని, రెండున్నరేళ్ల వరకు పూతను తీసి వేయాలన్నారు. ఆయిల్ పామ్ పంటలో కోకో పంటను కూడా అంతర పంటగా సాగు చేసుకోవచ్చని తెలిపారు. నింద్ర, కార్వేటినగరం, గంగాధరనెల్లూరు మండలాల్లో ప్రభుత్వం ఆయిల్‌పామ్ మొక్కలను ఉచితంగా అందిస్తోందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఏపీఎంఐపీ పీడీ బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంటలో చీడపీడల బెడద తక్కువగా ఉంటుందని, కోకో ద్వారా చాక్లెట్ తయారీతో పాటు వాటి బొప్పెల్లో పొటాషియం అధికంగా ఉండటంతో వాటిని పశువుల దాణా తయారీలో వినియోగిస్తారని పేర్కొన్నారు. చిన్న సన్నకారు రైతులకు 90 శాతం, పెద్ద రైతులకు 70 శాతం రాయితీ ద్వారా డ్రిప్ పరికరాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరాజు, మండల వ్యవసాయ అధికారి హేమలత, 3 ఎఫ్ ఆయిల్‌పామ్ సిబ్బంది, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

అక్షరయోగి 'ఆత్రేయ' చిరస్మరణీయుడు

– 20 మందికి ఆత్రేయ పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న సంఘ సేవకులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): సుమధుర గీతాల జీవనాడిగా, తెలుగుపాటకు పతాకగా ఆత్రేయ ఖ్యాతికెక్కారని భారతీయ తెలుగు రచయితల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు సి.నారాయణ స్వామి, ఉపాధ్యక్షులు నందిపాటి చక్రపాణి తెలిపారు. చిత్తూరు నగరంలోని కార్యాలయంలో బుధవారం సమాఖ్య జాతీయ గౌరవాధ్యక్షుడు మల్రిపూడి దేవేంద్రరావు నేతృత్వంలో ఆచార్య ఆత్రేయ 105వ జయంతి సందర్భంగా 'ఆత్రేయ సాహితీ సుగంధం' పై గీతాలాపన, కవితార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పోస్ట్ డాక్టోరల్ కె.సి.లావణ్య, ప్రముఖ కవయిత్రి జి.శాంతకుమారి మాట్లాడుతూ మనిషికి, మనసుకు సరికొత్త భాష్యాలు పలికిన అక్షర యోగిగా ఆత్రేయ తెలుగు ప్రేక్షకుల హృదయాలలో చిరస్మరణీయుడుగా మిగిలిపోయారన్నారు. ప్రముఖ రచయితలు గొడుగుచింత గోవిందయ్య, కొలారి వెంకటరత్నం మాట్లాడుతూ మూడున్నర దశాబ్దాల పాటు పాటల పూదోటను విరియింపజేసిన వనమాలిగా కీర్తిని పొందారన్నారు. 20 మంది సాహితీవేత్తలకు, సంఘసేవకులకు ఆచార్య ఆత్రేయ ఆత్మీయ జాతీయ పురస్కారాలను 2025ను ప్రముఖ సాహితీవేత్త మల్రిపూడి దేవేంద్రరావు అందజేశారు. ప్రముఖ కవి ఎం.శ్రీరాజుకు 'నవరస కవిచంద్ర' బిరుదును ప్రదానం చేశారు. కార్యక్రమంలో పురస్కార గ్రహీతలు సోము ఉమాపతి, తోట గోవిందన్, మునీంద్ర, అనంతపద్మనాభన్, కోటీశ్వర మొదలియార్, రోహిత్ కుమార్, శాంతకుమారి, గొడుగుచింత గోవిందయ్య, ఆనందనాయుడు, నరేంద్ర, యువరచయిత్రి టీఎస్ ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని కల్లుపల్లి వాసి మృతి



మునిరత్నం మృతదేహం

పలమనేరు: పట్టణ సమీపంలోని గంటావూరు ఫ్లైఓవర్ వద్ద బుధవారం స్కూటీలో రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. గంగవరం మండలం కల్లుపల్లికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మునిరత్నం అలియాస్ చిన్నబ్బోడు పలమనేరులోని గంటావూరు చెరువుకట్ట రోడ్డు నుంచి స్కూటీలో వెళుతూ హైవే దాటే సమయంలో ఓ కారు వేగంగా వచ్చి అతడి స్కూటీని ఢీకొంది. దీంతో మునిరత్నం అక్కడికక్కడే మరణించాడు. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉంది. కాగా మృతునికి డిగ్రీ చదివే కుమారుడున్నారు. ఇతని భార్య కొన్నాళ్ల కిందట మృతి చెందింది. గత నెలలో మృతుడి అన్న సుబ్రమణ్యం అలియాస్ పెద్దబ్బోడు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో కల్లుపల్లెలో విషాదచాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్ మృతి



ఏఆర్ కానిస్టేబుల్ డిల్లీ

వడమాలపేట (విజయపురం) : తిరుపతిలో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న డిల్లీ (40) మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా.. నాగలాపురం వినోబానగర్‌కు చెందిన డిల్లీ తిరుపతిలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తుండగా.. వడమాలపేట కదిరిమంగళం మలుపు వద్ద వెంకటగిరికి చెందిన ఓ కుటుంబం అంజేరమ్మను దర్శించుకుని కారులో తిరిగి వెళ్తూ ఢీకొంది. ఈ ఘటనలో గాయపడిన డిల్లీని పోలీసులు తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ధర్మారెడ్డి తెలిపారు.

తల్లిపై కొడుకులు, కోడళ్ల దాడి

చిత్తూరు అర్బన్: కన్నతల్లిపై దాడికి పాల్పడిన కొడుకులు, ఇద్దరు కోడళ్లపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. చిత్తూరు వన్‌టౌన్ సీఐ మహేశ్వర కథనం మేరకు.. నగరంలోని వెంగళరావు కాలనీకి చెందిన సుగుణమ్మ ఈనెల 5వ తేదీ ఇంటి వద్ద ఉండగా, కుటుంబ విషయమై తన కొడుకులతో వాగ్వాదం జరిగింది. దీంతో ఇద్దరు కొడుకులు, ఇద్దరు కోడళ్లు కలిసి తనపై దాడి చేసి, గాయపరచారని సుగుణమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై బాధితురాలి కొడుకులు కరుణకుమార్, హరీష్, కోడళ్లు రేవతి, రోసీపై క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యువతి ఆత్మహత్య

బంగారుపాళెం: మండలంలోని తుంబపాళెనికి చెందిన ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడి, చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. సీఐ కథనం మేరకు.. గ్రామానికి చెందిన భాస్కరయ్య కుమార్తె శశికళ(21) డిగ్రీ వరకు చదువుకుంది. ఉద్యోగ ప్రయత్నాలు ఫలించలేక పోవడంతో మనస్తాపానికి గురై ఈ నెల 5వ తేదీ పిడుదుల నివారణ మందు తాగింది. ఈ విషయం గుర్తించిన కుటుంబ సభ్యులు బంగారుపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ తెలిపారు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రూ.కోట్లు కొల్లగొట్టే స్కామ్



మాట్లాడుతున్న బీసీ విభాగం నాయకులు చిన్నయాదవ్, జ్ఞానజగదీష్



మాట్లాడుతున్న మహిళా విభాగం నాయకులు మాధవరెడ్డి, హరిణిరెడ్డి, అంజలిరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: మహిళలకు కుట్టు మిషన్లు, శిక్షణ పేరుతో కూటమి నాయకులు భారీ మోసానికి తెగబడ్డారని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మాధవిరెడ్డి, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు చిన్నియాదవ్, రాష్ట్ర మొదలియార్ విభాగం అధ్యక్షుడు జ్ఞానజగదీష్, మున్సిపల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిణిరెడ్డి విమర్శించారు. బుధవారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో బీసీ, మహిళా విభాగం నాయకులు వేర్వేరుగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుట్టు మిషన్ కొనుగోలుకు రూ.4300, ఒక వ్యక్తి శిక్షణ నిమిత్తం రూ.3 వేలు కలిపి మొత్తం రూ.7,300 ఖర్చు అవుతుందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఒక్కో మహిళకు రూ.23 వేల చొప్పున కేటాయించడం దోపిడీ కాక మరేమిటని ప్రశ్నించారు. వాస్తవంగా లబ్ధిదారులకు అయ్యే ఖర్చు రూ.73 కోట్లు అయితే, ఇతర ఖర్చులు పోను కూటమి నాయకులకు రూ.150 కోట్లు దోచిపెట్టేందుకు పథక రచన చేశారని ఆరోపించారు. బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, బీసీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి 11 నెలలు దాటినా ఒక్క హామీని కూడా అమలు చేయకుండా ప్రజలను మోసగించారని మండిపడ్డారు. బీసీ మహిళలకు కుట్టు శిక్షణ పేరుతో రూ.150 కోట్లకు పైగా దోపిడీ చేస్తున్న కూటమి పాలకులు, త్వరలోనే కమ్మ, కాపు, వైశ్య, క్షత్రియులకు ఈబీసీ కార్పొరేషన్ల పేరుతో మరో రూ.81 కోట్లు నొక్కేసేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. కార్యక్రమంలో మహిళా, బీసీ విభాగాలు ముఖ్య నాయకులు అంజలిరెడ్డి, భాగ్యలక్ష్మి, ప్రతిమారెడ్డి, నారాయణ, త్యాగ, నవీన్‌యాదవ్, కవిత, కౌసర్, హరిషారెడ్డి, మంజులరెడ్డి, గోపి, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్వోకు వినతి

బీసీ మహిళలకు టైలరింగ్ శిక్షణ పేరిట కూటమి ప్రభుత్వం రూ.కోట్ల అవినీతికి పాల్పడిందని వైఎస్సార్ సీపీ మహిళా, బీసీ విభాగం జిల్లా, రాష్ట్ర నాయకులు విమర్శించారు. బుధవారం కలెక్టరేట్‌లోని డీఆర్వో మోహన్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కుట్టు శిక్షణకు లక్ష మంది బీసీ మహిళలకు రూ.73 కోట్లు పైగా ఖర్చవుతుంటే, చంద్రబాబు ప్రభుత్వం రూ.257 కోట్లు పైగా చూపించడం ఏమిటన్నారు. పెద్ద కంపెనీలకు టెండర్ ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం ఎల్2, ఎల్3 కంపెనీలకు టెండర్ కట్టబెట్టి రూ.కోట్లు దోచుకుంటోందన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి, మహిళలకు న్యాయం చేయాలన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపుపై ప్రత్యేక శ్రద్ధ

– చిత్తూరు నూతన డీవైఈఓ ఇందిర



డీవైఈఓకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్టీయూ, హెచ్ఎం, ఎంఈఓ సంఘ నేతలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాల పెంపుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని చిత్తూరు డీవైఈఓ ఇందిర అన్నారు. బుధవారం పాత కలెక్టరేట్‌లోని డీవైఈఓ కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. మొదటగా డీఈఓ వరలక్ష్మిని ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. చిత్తూరు డివిజన్‌లో వచ్చే విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల సంఖ్య పెంపొందించేందుకు చర్యలు చేపడతామన్నారు. డివిజన్ పరిధిలో పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు నిర్వహిస్తున్న రెమిడియల్ తరగతులను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు చేపడతామని తెలిపారు. అనంతరం నూతన డీవైఈఓను ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటామోహన్, జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి, గణేష్, హెచ్ఎం, ఎంఈఓ సంఘాల ప్రతినిధులు త్యాగరాజులురెడ్డి, రుక్మిణమ్మ, కోమల, అరుణ్‌కుమార్, మధుసూదన్‌రెడ్డి, భాస్కరరావు, సోము, తులసిబాబు తదితరులు పాల్గొన్నారు.